నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 11 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

ఐలమ్మ వీరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 10 : సమైక్యాంధ్రలో కనుమరుగైన తెలంగాణ యోధుల చరిత్ర నేటి తరానికి తెలిసేలా వారి జయంతులు, వర్ధంతులను అధికారికంగా నిర్వహించేలా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు తీసుకున్నరని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆర్అండ్బీ ఇంజినీరింగ్ చీఫ్తో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

బడికి ఎలా వెళ్లాలి?

చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత స్కూల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తున్నది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా విద్యార్థుల తల్లిదండ్రులు కరెంటు మోటర్, ఇంజిన్ తీసుకొచ్చి నిల్వ నీటిని మురికి కాల్వలోకి వదిలారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రధానోపాధ్యాయులు, డీఈవో, జిల్లా ఉన్నతాధికారులు స్పందించడం లేదని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఇచ్చోడ, సెప్టెంబర్ 10

నిబంధనలేవీ?

● ప్రైవేటు ఆసుపత్రుల ఇష్టారాజ్యం ● 60 హాస్పిటల్స్కు నోటీసులు ● అధికారుల విస్తృత తనిఖీలు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల దందాకు అడ్డుకట్ట వేయడానికి వైద్యశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. జిల్లాలో రెండు నెలలుగా సీజనల్ వ్యాధుల ప్రభావం కారణంగా ప్రజలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో జనం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇదే అవకాశంగా భావించిన ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా అందినకాడికి దోచుకుంటున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రజలు భారీగా ఫీజులు చెల్లించకుండా వారికి సరైన వైద్యం అందేలా కలెక్టర్ రాజర్షి షా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గత నెల 20న జిల్లా కేంద్రంలోని గజానన్ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించి పలు లోపాలను గుర్తించారు. కనీస నిబంధనలు పాటించని ఆసుపత్రి నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యశాఖ ఎనిమిది మంది ప్రోగ్రాం అధికారులు జిల్లావ్యాప్తంగా 20 రోజులుగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారుల తనిఖీల్లో ప్రైవేట్ దవాఖానలు కనీస నిబంధనలు పాటించడం లేదని వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

60 ఆసుపత్రులకు నోటీసులు

ఆదిలాబాద్ జిల్లాలో 144 ఆసుపత్రులు క్లినిక్లు ఉన్నాయి. ఆదిలాబాద్, ఉట్నూరు, ఇచ్చోడ, బోథ్ ప్రాంతాల్లో ఆసుపత్రులు ఎక్కువగా ఉన్నాయి. కొందరు వైద్యశాల ఏర్పాటును వ్యాపారంగా ఎంచుకుని అందులోనే మెడికల్ షాపులు, వ్యాధి నిర్ధారణ పరీక్షల ల్యాబ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆసుపత్రులతోపాటు మెడికల్ షాపులు, ల్యాబ్లలో అర్హత కలిగిన సిబ్బందిని ఉంచడం లేదు. వైద్యశాఖ అధికారులు తనిఖీల్లో లోపాలను గుర్తించి 60 ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. చాలా ఆసుపత్రుల్లో అధికంగా ఫీజులు వసూలు చేయడం, ధరల పట్టికలను అందుబాటులోకి ఉండకపోవడం, వ్యర్థాల నిర్వహణ లేకపోవడం, అగ్నిప్రమాద నివారణ చర్యలు చేపట్టకపోవడం వంటి లోపాలను గుర్తిస్తున్నారు. వీటితోపాటు జ్వరాలు, డెంగ్యూ కేసులు వివరాలు నమోదు చేయకపోవడం, ఓపీ, ఐసీయూ, వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరల వివరాలను వెల్లడించకపోవడం, మందుల నిల్వల్లో తేడా వంటి వాటిని అధికారులు గుర్తిస్తున్నారు.

ఆదిలాబాద్లోని ప్రైవేట్ దవాఖానలోని మెడికల్ షాపులో ముందుల వివరాలు పరిశీలిస్తున్న డీఎంహెచ్వో

చర్యలు తీసుకోవాలి..

జిల్లాలోని నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రుల వ్యవహారాన్ని నోటీసులతో ముగించవద్దని ప్రజలు కోరుతున్నారు. వైద్యం పేరిట భారీగా డబ్బులు వసూలు చేస్తున్న హాస్పిటళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలంటున్నారు. నిబంధనలు పాటించని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేస్తామని, లోపాలను సరి చేసుకోకుంటే చర్యలు తీసుకుంటామని వైద్యశాఖ అధికారులు తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించండి

బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, సెప్టెంబర్ 10 : నియోజకవర్గంలో వర్షాలకు రోడ్లు దెబ్బతినడంతో ప్రజలు నడవలేని స్థితికి చేరాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మంగళవారం ఆర్అండ్బీ ఇంజినీరింగ్ చీఫ్ మోహన్ను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ హైదరాబాద్లోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మంజూరైన రోడ్లకు టెండర్ల నిర్వహణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ విషయాలపై సానుకూలంగా స్పందించిన అధికారి తక్షణమే ఆదిలాబాద్ ఆర్అండ్బీ అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే నివేదికను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. మంజూరైన రోడ్ల టెండర్లు కూడా త్వరగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఇందులో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్గౌడ్ ఉన్నారు.

సెర్ప్ సీఈవోను కలిసిన జాదవ్

సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మంగళవారం హైదరాబాద్లో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సీఈవోకు శాలువా కప్పి సన్మానించారు.

డబ్బులు చెల్లించాకే పనులు ప్రారంభమవుతాయి : ఆర్డీవో

నేరడిగొండ, సెప్టెంబర్ 10 : కుప్టి ప్రాజెక్టు నిర్మాణంలో భూములు, నివాసాలతో పాటు ఇతరత్రా అన్నింటిని కోల్పోయిన వారికి ప్రభుత్వం డబ్బులు చెల్లించిన తర్వాతనే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తారని ఆర్డీవో వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం కుప్టి ప్రాజెక్టు నిర్మాణ విషయంలో నిర్వాసితులతో కలిసి కుమారి గ్రామ పంచాయతీలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మీ సమస్యలుంటే తెలిపితే నిర్వాసితులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్తులు కొందరు ప్రాజెక్టు కోసం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎంఏ కలీం, ఆర్ఐ నాగోరావ్, ఇరిగేషన్ ఎస్ఈ విఠల్, డీఈ భీంరావ్, ఏఈ ప్రకాశ్, సర్వేయర్ శంకర్ పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ నంబర్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్వో, ఎన్సీడీ పీవో

ఆత్మహత్యలు చేసుకోవద్దు

● ఉచిత కౌన్సెలింగ్ కొరకు 14416ను సంప్రదించాలి

● రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఎదులాపురం, సెప్టెంబర్ 10 : క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో డీఎంహెచ్వో కృష్ణ, ఎన్సీడీ పీవో శ్రీధర్లతో కలిసి టెలిమనస్ టోల్ ఫ్రీ నంబర్ 14416 కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచంలో ప్రతి 40 సెకండ్లకు ఒక ఆత్మహత్య జరుగుతుండగా.. మన దేశంలో ప్రతి రెండు నిమిషాలకు ఒకరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ఎల్.ఓం ప్రకాశ్, సైకాలజిస్ట్ శ్రీకాంత్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, సామాజిక కార్యకర్త చిరంజీవి, పాల్గొన్నారు.

డీఎంహెచ్వో కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్టీయూ నాయకులు

సమస్యలను పరిష్కరించాలని వినతి

ఎదులాపురం, సెప్టెంబర్ 10 : ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కారించాలని బీఆర్టీయూ(భారత్ రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ హెచ్-1) జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ అన్నారు. మంగళవారం డీఎంహెచ్వోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలు, ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన చాలా మంది ఆశ కార్యకర్తలకు డబ్బులు ఇవ్వలేనదన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఆశ కార్యకర్తల వద్ద గతంలో ఇచ్చినటువంటి(స్మార్ట్ ఫోన్) చెడిపోవడం జరిగిందని, వాటి స్థానంలో కొత్తగా స్మార్ట్ ఫోన్లు ఇవ్వాలన్నారు. కలిసినవారిలో కోశాధికారి నెట్టెడి నగేశ్, ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు డి.సరస్వతి ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ఎదులాపురం, సెప్టెంబర్ 10 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు మండిపడ్డారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వాలు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. పనికి తగ్గ ప్రతిఫలం ఇవ్వడం లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్రెడ్డి అధికారంలోకి రాకముందు మధ్యాహ్న భోజన కార్మికులు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు నేరవేర్చలేదన్నారు. కోడి గుడ్ల బిల్లులు ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్నాయని, అవి ఇవ్వకుండా విద్యార్థులకు గుడ్లు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మికులు సుప్రీంకోర్టు సూచన మేరకు రూ.26 వేలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, యూనిఫాం, కోడి గుడ్ల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు నాందేవ్, రాంబాయి, అనిల్, ఇస్రు, నాగమణి, పుష్పలత, శ్రీదేవి, లక్ష్మి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సాంగిడి గ్రామంలో పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

పరిహారం అందిస్తాం

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

బేల, సెప్టెంబర్ 10 : ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు రూ.10 వేలు నష్ట పరిహారం అందించడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని సాంగిడి, బేదోడ గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ రాజర్షి షా స్వయంగా వెళ్లి దెబ్బతిన్న ఇల్లు, కల్వర్టులు, పంటలను పరిశీలించారు. పత్తి నీట మునిగి నష్టం వాటిల్లిందని, ఇండ్లలోకి నీరు చేరడంతో వస్తువులు తడిచాయని, కాంపౌండ్ గోడ కూలిపోవడం జరిగిందన్నారు. వంతెన నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంట నష్టపోయిన వారి అకౌంట్, ఆధార్ కార్డు నంబర్లను 12వ తేదీలోగా ప్రభుత్వానికి పంపిస్తామని, ఎకరానికి రూ.10 వేల చొప్పున వారి అకౌంట్లో జమ అవుతాయని తెలిపారు. అలాగే 31 ఆగస్టు నుంచి సెప్టెంబర్ 8 వరకు కచ్చా ఇల్లు, పక్కా ఇల్లు వర్షానికి కూలితే వాటి వివరానలు తహసీల్దార్లు సేకరించి ట్రెజరీ ద్వారా డిటైల్స్ సబ్మిట్ చేస్తారన్నారు. వీరి అకౌంట్లో కూడా రూ.16,500 జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఇన్చార్జి తహసీల్దార్ వామన్రావ్, ఎంపీడీవో మహేందర్ కుమార్, మండల పంచాయతీ అధికారి వినోద్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరగాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 10 : ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనం జరగాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణేశ్ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, సంబంధిత అధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి, కమిటీ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి అపశ్రుతులకు తావులేకుండా ఆనందోత్సాహాల మధ్య భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవం జరిగేలా ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. వినాయక చౌక్ నుంచి శోభాయాత్ర ప్రారంభం కానుండగా, భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే దారిలో ఉన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ శాఖకు సంబంధించిన 94921 64153కు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన ఐలమ్మ

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, సెప్టెంబర్ 10 : భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మంగళవారం రిమ్స్ ఆస్పత్రి ఎదుట ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని, తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించి 2022 సెప్టెంబర్ 22న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కిష్టాపురం గ్రామంలో 1895 సెప్టెంబర్ 26న ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు నాలుగో సంతానంగా చాకలి ఐలమ్మ జన్మించిందన్నారు. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ సెప్టెంబర్ 10, 1985న అనారోగ్యంతో మరణించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజలింగు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి చేయాలి

- నిర్మల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్కుమార్

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 10 : చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐలమ్మ 39వ వర్ధంతిలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్గోపాల్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

సురేశ్ దంపతులను సన్మానిస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

శెభాష్.. సురేశ్ సార్

భీంపూర్, సెప్టెంబర్ 10 : ఆదిలాబాద్ డీఈవో ప్రణీత మంగళవారం సాయంత్రం ధనోరా పాఠశాల ఉపాధ్యాయుడు గుమ్మడి సురేశ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. పాఠశాలలో 1వ తరగతి విద్యార్థికి పాము కాటు వేయగా సురేశ్ నోటితో విషం తీసి ఆ విద్యార్థిని కాపాడిన వైనం గురించి తెలుసుకున్నారు. సురేశ్ కూడా సోమవారం రాత్రి విష ప్రభావంతో అనారోగ్యానికి గురయ్యాడు. రిమ్స్లో చికిత్స తీసుకుని డిశ్చార్జి అయ్యారు. ఈ విషయం తెలిసి డీఈవో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శెభాష్ సురేశ్ అంటూ అభినందించి దంపతులను శాలువాతో సన్మానించారు. తరువాత డీఈవో ఆదిలాబాద్లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి యశ్వంత్ను కూడా పరామర్శించారు. అంతకు ముందు డీఈవో ధనోరా పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాల్లోని పొదలను తొలగించాలని గ్రామస్తులను కోరారు. డీఈవోతో ఉపాధ్యాయుడు శ్రీకాంత్ ఉన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఉట్నూర్ , సెప్టెంబర్ 10 : పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్ నందు ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడకు చెందిన ముస్లిం పెద్దలు, యువతతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎస్పీ మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలు, మిలాద్ వున్ నబీ పండుగలు ఉన్నందున్న పాటించవల్సిన నియమాల గురించి వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమయనం పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్ గౌడ్, సీఐ మొగిలి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

డెలివరీ బాయ్ లైంగికదాడికియత్నం

● ఆర్డరు చేసిన వస్తువులను ఇవ్వడానికి వచ్చి నిర్వాకం

● గృహిణీ కేకలు వేయడంతో పరారైన యువకుడు

● అరెస్టు చేసి రిమాండ్కు పంపిన పోలీసులు

సోన్, సెప్టెంబర్ 10 : నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ కాలనీకి చెందిన ఓ గృహిణి ఆన్లైన్లో వస్తువులను ఆర్డరు చేసింది. సంబంధిత కంపెనీకి చెందిన డెలివరీ బాయ్ వస్తువులను మంగళవారం డెలివరీ చేసే క్రమంలో సదరు గృహిణిపై లైంగికదాడికి యత్నించాడు. అప్రమత్తమైన ఆ మహిళ కేకలు వేసి ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వెంటనే యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిర్మల్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. లైంగికదాడికి యత్నించిన బాయ్ని అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై సాయికుమార్లు వెల్లడించారు.

విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా